క్లుప్తంగా

ఆలయాలకు నీళ్ల ట్యాంకుల వితరణ



ట్యాంకులను అందిస్తున్న దాతలు, యువర్స్ ఫౌండేషన్ సభ్యులు

ధర్మవరం అర్బన్: యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వంకదారి సుజాతమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు వంకదారి రామచంద్ర గుప్త, కుమార్తెలు నీరజాదేవి, షర్మిలాదేవి, హేలసాదేవిల సహకారంతో నాలుగు నీళ్ల ట్యాంకులను ఆలయాలకు వితరణ చేశారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలోనున్న వైద్యనారాయణధన్వంతరీ త్యాగరాజస్వామి ఆలయం, గువ్వలగొందిపల్లిలోని అభయాంజనేయస్వామి ఆలయం, నార్పల మండలం వెంకటంపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయం, గొట్లూరులోని మహంకాళమ్మ ఆలయాలకు ఈ ట్యాంకులను అందించారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ బీవీ సుబ్బారావు, వైకే శ్రీనివాసులు, కోటేశ్వరరావు, బండి నాగేంద్ర, జయంతి వినోద్, బాబు, ఓవీ ప్రసాద్, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు రిజిస్ట్రేషన్లు

కదిరి అర్బన్: పట్టణంలోని ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఇంటర్ పాసైన విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీఏ, బీకామ్, బీఎస్సీలో ప్రవేశాలకు విద్యార్థులు తమ ధ్రువపత్రాలను తీసుకుని ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కదిరి అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వరప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సు ఎంపీహెచ్ డబ్ల్యూ(ఫిమేల్) కోర్సులు ఇంగ్లిష్, తెలుగు మీడియంలలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆహ్లాదం కోసమే వేసవి విజ్ఞాన శిబిరాలు



విద్యార్థులతో కథలు చదివిస్తున్న గ్రంథాలయ అధికారి రాజేశ్వరి

బత్తలపల్లి: వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఆహ్లాదకరం కోసం జిల్లా వ్యాప్తంగా వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు బత్తలపల్లి శాఖ గ్రంథాలయ అధికారి రాజేశ్వరి తెలిపారు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈ నెల 15 నుంచి జూన్ 7 వరకు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు కొనసాగుతాయన్నారు. విద్యార్థులకు ఇంగ్లిష్ భాషలో మెరుగైన శిక్షణ, తెలుగు, చిత్రకళలు, వ్యక్తిత్వ వికాసం తదితర వాటిపై నిష్ణాతులైన అధ్యాపకులచే శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మొదటి రోజు విద్యార్థులకు కథలు చదివించడం, కథలు చెప్పించడం, చెస్, క్యారమ్ నేర్పించడం, పాము పటం ఆట ఆడించడం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్వేషాలు రెచ్చగొట్టొద్దు

నల్లచెరువు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యేవరకూ మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్ఐ లింగన్న బుధవారం తెలిపారు. అనుమతులు లేకుండా రాజకీయ ప్రచారాలు, సభలు నిర్వహించకూడదన్నారు. గ్రామాల్లో ఎవరైనా విద్వేషాలు రెచ్చగొట్టినా, హింసాత్మక ఘటనలకు పాల్పడినా తమకు సమాచారం అందజేయాలన్నారు. చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా బాలికల దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

ముదిగుబ్బ: ఆర్డీటీ ఆధ్వర్యంలో బుధవారం ముదిగుబ్బలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డైరెక్టర్ కృష్ణవేణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిని ఏ విధంగా పరిష్కరించుకోవాలి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటరమణ, గంగాధర్, ముదిగుబ్బ ఏటీఎల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలే నిర్ణేతలు

- పోలైన ఓట్లలో వారిదే ఆధిక్యం
- వారితోనే వైఎస్సార్‌సీపీకి సానుకూలత
- కదిరి నియోజకవర్గంలో 81.37 శాతం పోలింగ్



కదిరిలోని పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన మహిళా ఓటర్లు (ఫైల్)

కదిరి: సాధారణ ఎన్నికల్లో మహిళా ఓటర్లే నిర్ణేతలు కానున్నారు. ఎవరు గెలవాలన్నా వారి ఓట్లే కీలకంగా మారాయి. కదిరి అసెంబ్లీ నియోజకవర్గంలో 2,53,420 ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,24,650, మహిళలు 1,28,762. పోలైన ఓట్లను పరిశీలిస్తే పురుష ఓటర్లు 1,02,411 మంది, మహిళా ఓటర్లు 1,03,796 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ ఇంత పెద్ద ఎత్తున ఓటు హక్కు వినియోగించుకోలేదు. కదిరి టౌన్‌లో 57,730 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోగా వారిలో మహిళలు 29,673 మంది ఉన్నారు. కదిరి రూరల్ మండలంలో 23,843 మంది ఓటర్లు ఓటు వేయగా.. వీరిలో 11,960 మంది మహిళలు ఉన్నారు. తలుపుల మండలంలో సైతం పురుషుల కన్నా మహిళా ఓటర్లే ఎక్కువ శాతం ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ 28,010 మంది ఓటు వేయగా.. వీరిలో మహిళా ఓటర్లే 14,015 మంది ఉన్నారు. నల్లచెరువు మండలంలోనూ మహిళలదే పైచేయి. ఈ మండలంలో మొత్తం 22,177 మంది ఓటు వేయగా.. వీరిలో మహిళలు 11,131 మంది ఉన్నారు. మహిళా ఓటర్లు పెద్ద సంఖ్యలో తమ ఓటుహక్కు వినియోగించుకోవడంతో కదిరిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బి.ఎస్.మక్బుల్ అహ్మద్ సునాయాసంగా గెలుపొందవచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా మహిళలే పెద్ద ఎత్తున లబ్ధి పొందుతున్నారని, అందుకే రాష్ట్రంలో మళ్లీ జగనే రెండోసారి ముఖ్యమంత్రి పీఠం అధిష్టించనున్నారని వారంటున్నారు.

కదిరి నియోజకవర్గంలో మండలాల వారీగా పోలైన ఓట్ల వివరాలు

మండలం	మొత్తం ఓట్లు	పోలైన పురుష ఓట్లు	పోలైన మహిళా ఓట్లు	ఇతరులు	పోలైన మొత్తం ఓట్లు	పోలింగ్ శాతం
తలుపుల	33,532	13,994	14,015	01	28,010	83.53
కదిరిరూరల్	27,261	11,881	11,960	02	23,843	87.46
కదిరిటౌన్	80,953	28,056	29,673	01	57,730	71.31
గాండ్లపెంట	21,451	9,341	9,325	02	18,668	87.03
ఎన్‌పీకుంట	24,552	10,521	10,258	--	20,779	84.63
నల్లచెరువు	25,017	11,046	11,131	--	22,177	88.65
తనకల్లు	40,654	17,572	7,434	01	35,007	86.11
మొత్తం	2,53,420	1,02,411	1,03,796	0	72,06,214	81.37

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు



ఓబుళనాయనపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

ధర్మవరం అర్బన్: ధర్మవరంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15 నుంచి జూన్ 4వతేదీ కౌంటింగ్ పూర్తయ్యేవరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా హింసాత్మకమైన ఘటనలకు పాల్పడినా, విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యవహరించినా వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడా గుంపులుగా ఉండకూడదని, అనుమతులు లేకుండా సభలు, ప్రచారాలు నిర్వహించరాదని తెలిపారు. దీనిని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని అందరూ సమయస్ఫూర్తితో ఉండాలని, ఎక్కడా ఎటువంటి అల్లర్లు, గొడవలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు. ధర్మవరం ప్రజలతోపాటు అన్ని రాజకీయపార్టీల నాయకులు దృష్టిలో పెట్టుకోవాలన్నారు.

మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందని ఎస్ఐ వెంకటేశ్వర్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. హింసాత్మక ఘటనలకు పాల్పడిన, విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసులకు సహకరించాలన్నారు.

144 సెక్షన్ కొనసాగింపు

ఎన్‌పీ కుంట: మండలంలో 144 సెక్షన్ కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. బుధవారం ఆయన పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఎస్పీ మాధవ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యేవరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యవహరించినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ధర్మవరం రూరల్: గ్రామాలలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామమైన ఓబుళనాయనపల్లిలో ఆయన పర్యటించారు. ఎన్నికల అనంతరం గ్రామంలో ఉద్రిక్తత చోటు చేసుకున్నందున గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. దాడులు, ప్రతిదాడులకు ఎవరూ పాల్పడవద్దని, ప్రజలందరూ చట్ట పరిధిలో జీవించాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ నరేంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధైర్యంగా ఉండండి.. అండగా ఉంటాం



ఫణిశేఖర్‌ను పరామర్శిస్తున్న శ్రీధర్‌రెడ్డి



బయపరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: పలు ఘటనల్లో తీవ్రంగా గాయపడి చికిత్స అనంతరం చెర్లోపల్లిలోని ఇళ్ల వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు బయపరెడ్డి, మాధవరెడ్డి, గంగప్పలను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

అమడగూరు: కమ్మవారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణ కుమారుడు పవన్ (22) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి బుధవారం గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించాడు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని భరోసా కల్పించారు.

అండగా ఉంటా..

కొత్తచెరువు: మండల కేంద్రానికి చెందిన వార్డు మెంబర్ ఫణిశేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి పుట్టపర్తి సత్యసాయి సూపర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి బుధవారం ఆస్పత్రిలో ఫణిశేఖర్‌ను పరామర్శించి ఆరోగ్యంపై ఆరా తీశారు. అధైర్య పడవద్దు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాపు సంఘం జిల్లా నాయకులు దాల్ మిల్ సూరి, కొత్తచెరువు ఉప సర్పంచ్ యుగంధర్, విజయ్, చెన్నకేశవులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సెట్ హాల్ టికెట్ల పంపిణీ



రొళ్లలో సెట్‌కు ఎంపిక అయిన విద్యార్థులకు హాల్ టికెట్లు అందిస్తున్న ఏటీఎల్ ఓబులేసు

రొళ్ల: గ్రామీణా ప్రాంతాల్లో ఇష్టంగా చదివే బాల, బాలికలను సమాజంలో ఉన్నతమైన స్థానంలో స్థిర పడేటట్లు ప్రోత్సహించడమే ఆర్డీటీ లక్ష్యమని ఆ సంస్థ ఏటీఎల్ ఓబులేసు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్డీటీ కార్యాలయంలో రొళ్ల, అగళి మండలానికి చెందిన 46 మంది విద్యార్థులకు ఆర్డీటీ సెట్ అర్హత పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏటీఎల్ ఓబులేసు మాట్లాడుతూ ఆర్డీటీ ద్వారా గణితం, సైన్స్ సబ్జెక్టులకు సంబంధించిన 100 మార్కులకు అర్హత పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో ఉత్తీర్ణులైన విద్యార్థులను ఆరేళ్ల పాటు వివిధ కార్పొరేట్ కళాశాలల్లో చేర్పించి ఉచితంగా చదివించడం జరుగుతుందన్నారు. హాల్ టికెట్లు అందుకున్న విద్యార్థులకు ఈ నెల 19న హిందూపురం బస్టాండ్ సమీపంలోని ఎన్ఎస్‌పీఆర్ బాలికల డిగ్రీ కళాశాలలో ఆర్డీటీ సెట్ అర్హత పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు.

కూలీలకు విరివిగా పనులు కల్పించండి

ఓడీచెరువు : ఉపాధి హామీ పథకం కింద కూలీలకు విరివిగా పనులు కల్పించాలని ఏపీడీ శ్రీనివాసరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఏపీడీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కూలీకి రూ.300 కూలి తగ్గకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కూలీలకు వంద శాతం పనులు కల్పించాలని, హాజరు వంద శాతం ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీఓ సుధాకర్, జేఈ ఆంజనేయులు, టెక్నికల్ అసిస్టెంట్‌లు రాజారెడ్డి, చంద్రారెడ్డి, రాజేంద్ర, నాగముని, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

నల్లమాడ: మండల కేంద్రం నల్లమాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వీఎస్ఆర్ ఉదయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో అందుబాటులో ఉన్నాయని, ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మెగా సప్లిమెంటరీ సద్వినియోగం చేసుకోండి

కదిరి అర్బన్: ఎస్కే యూనివర్సిటీ పరిధిలో 1994–95 నుంచి 2014–15 వరకు ఇయర్లీ సిస్టమ్‌లో చదివి సబ్జెక్టులు పెండింగ్ ఉన్నవారి కోసం చివరి అవకాశంగా యూనివర్సిటీ మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తోందని కదిరిలోని ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. థియరీ, ప్రాక్టికల్స్‌లో ఫెయిలైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తగిన ధ్రువపత్రాలతో జూన్ 14వ తేదీలోపు ఫీజు చెల్లించవచ్చని తెలిపారు.

రేపటి నుంచి గంగమ్మ తిరునాల

గాండ్లపెంట: మండల కేంద్రం గాండ్లపెంటలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు గంగమ్మ తిరునాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. 17న ఉదయం 9 గంటలకు అమ్మవారికి కలశపూజ, అభిషేకాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 18న మధ్యాహ్నం 3 గంటలకు అమ్మవారి పంచలోహ ఉత్సవ విగ్రహం ఊరేగింపు ఉంటుందన్నారు. రాత్రికి సంగీత భక్తి పాటల కచేరీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 19న తెల్లవారుజామున 2గంటలకు అమ్మవారికి జ్యోతులు, బోనాల సమర్పణ, సాయంత్ర 3 గంటలకు ఉట్ల తిరునాలతో ఉత్సవాలు ముగిస్తాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

హిందూపురం అర్బన్: సంతేబిదనూరు గేటు వద్ద మంగళవారం రాత్రి పొద్దుపోయిన తరువాత ఆటో ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని కొటిపి గ్రామానికి చెందిన నాగరాజు, మరో వ్యక్తి గాయపడినట్లు పోలీసులు తెలిపారు. సమీపంలోని వారు వెంటనే వారిని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. తరువాత మెరుగైన చికిత్స కోసం నాగరాజును అనంతపురం ఆస్పత్రికి తరలించినట్లు అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. మరో వ్యకి హిందూపురం ఆస్పత్రిలో కోలుకుంటున్నాడన్నారు.

గిరిజన పాఠశాలలో అడ్మిషన్లు

సోమందేపల్లి: మండలంలోని గిరిజన గురుకుల పాఠశాలలో 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. 3వ తరగతిలో ఎస్టీ 32, ఎస్సీ 5, బీసీ 2, ఓసీ 1, 4వ తరగతిలో ఎస్టీ 36, 5వ తరగతి ఎస్టీ 29, 6వ తరగతిలో 7, 7వ తరగతిలో 5, 8వ తరగతిలో 1, 9వ తరగతి 8 చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ నెల 20లోపు పాఠశాలకు వచ్చి చేర్పించవచ్చన్నారు.

ఎన్నికల మూడ్‌లోనే అధికారులు



తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు



తహసీల్దార్ కార్యాలయ కంప్యూటర్ గది వద్ద 1బీ, అడంగల్ కోసం గుమికూడిన రైతులు

- పోలింగ్ ముగిసినా విధులకు గైర్హాజరు
- కార్యాలయాల వద్ద అధికారుల కోసం ప్రజల పడిగాపులు

కనగానపల్లి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసినా అధికారులు మాత్రం ఇంకా ఎన్నికల మూడ్‌లోనే ఉన్నారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో చాలామంది అధికారులు విధుల్లో కనబడలేదు. కార్యాలయాల్లోని కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. గత నెల రోజులుగా ఎన్నికల విధులంటూ బయటనే తిరుగుతున్న అధికారులు, ఎన్నికలు పూర్తయినప్పటికీ ఇంక వారి సొంత కార్యాలయాల్లో విధులకు హాజరుకావడం కాలేదు. తహసీల్దార్, ఎంపీడీఓ, వ్యవసాయ కార్యాలయాల్లో ఎక్కడా ఒక్క అధికారి కూడా కనిపించడం లేదు. వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిన ప్రజలు అధికారులు లేక చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రస్తుతం ఖరీఫ్ పంట రుణాల రెన్యూవల్స్ చేసుకునేందుకు రైతులు వన్‌బీ, అడంగల్ పత్రాలతోపాటు అధికారులు సంతకాల కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కానీ తహసీల్దార్ దగ్గర నుంచి వీఆర్వో వరకు అధికారులు ఎవ్వరూ అందుబాటులో లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. పిల్లలను కళాశాలలు, పాఠశాలలో చేర్పించేందుకు అవసరమైన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు తల్లిదండ్రులు కూడా స్థానిక తహసీల్దార్ కార్యాలయం, గ్రామ సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కాని అక్కడ కూడా అధికారులు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వన్‌బీ, అడంగల్ కోసం అవస్థలు

ప్రస్తుతం బ్యాంకుల్లో పంట రుణాలు చేసుకునేందుకు రైతులకు భూముల వివరాల తెలిపే వన్‌బీ, అడంగల్ కాపీలు కావాల్సి ఉంది. గతంలో వీటిని సచివాలయాలు, మీ–సేవాల కేంద్రాల ద్వారా రైతులు పొందేవారు. కాని మండలంలో భూముల రీ సర్వే జరుగుతున్న కనగానపల్లి, ముత్తువకుంట్ల, నరసంపల్లి, యలకుంట్ల గ్రామాల్లోనికి రైతులకు ఆన్‌లైన్‌లో రావడం లేదంటున్నారు. దీంతో ఈ గ్రామాల రైతులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్దకే వచ్చి రెవెన్యూ అధికారుల నుంచి పొందాల్సి ఉంది. కాని కార్యాలయానికి రెవెన్యూ అధికారులు రాకపోవటంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు. వన్‌బీ, అడంగల్ కాపీలు ఇవ్వకపోతే బ్యాంకు అధికారులు రుణాలు రెన్యూవల్ చేయడం లేదు. రుణాల రెన్యూవల్ సమయం మించిపోతే వడ్డీ భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెల రోజులుగా వ్యవసాయశాఖ కార్యాలయం తలుపులు కూడా తెరవకపోవటంతో పనులు కోసం వచ్చిన రైతులు అక్కడే పడిగాపులు కాస్తున్నారు.



వ్యవసాయ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

వారం రోజులుగా తిరుగుతున్నాను



మీ–సేవా కేంద్రాల్లో వన్‌బీలు రావడం లేదు. దీంతో వీటిని పొందేందుకు వారం రోజుల నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. కాని అధికారులు ఎవ్వరూ ఇక్కడ ఉండటం లేదు. ఎన్నికల పూర్తయిన తర్వాత వస్తారనుకుంటే ఈ రోజు కూడా ఎవ్వరూ రాలేదు.

– ఓబిలేసు, రైతు, ముత్తువకుంట్ల

రుణాల రెన్యూవల్‌కు ఇబ్బంది



వన్‌బీ, అడంగల్ కాపీలపై రెవెన్యూ అధికారులు సంతకాలు లేకపోతే బ్యాంకుల్లో పంట రుణాలు రెన్యూవల్ చేసుకోవడం లేదు. కాని అధికారుల సంతకాల కోసం నాలుగు రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. తహసీల్దార్‌తో పాటు మిగిలిన సిబ్బంది కూడా అందుబాటులో లేరు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– లక్ష్మయ్య, రైతు, యలకుంట్ల